సాక్షి కర్నూలు

సోమవారం ; 23 ; జనవరి ; 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.



రూ. 10 లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్:శ్రీశైలదేవస్థానం భక్తుల వసతి సౌకర్యార్థం నిర్మిస్తున్న కుటీర నిర్మాణ పథకానికి హైదరాబాద్ చెందిన కేఎస్ నాగభూషణం రూ.10 లక్షలు ఆదివారం విరాళంగా అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,619.03
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:58.642
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,737

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వర రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్లాస్టిక్ వాడితే దుకాణాల లైసెన్స్ రద్దు

కర్నూలు (టౌన్): నగరంలో ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్‌ను వినియోగిస్తే సంబంధిత దుకాణాల ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ పేపర్లను, కవర్లను, ఫ్లెక్సీలను నిషేధించిందని పేర్కొన్నారు. కర్నూలును ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వలసల నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో ఏపీడీ, ఏపీవోలు, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. లేబర్ రిపోర్టింగ్ పెంచడంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి ప్రతి రోజూ లక్ష మందికి ఉపాధి పనులు కల్పించే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించామన్నారు. వలసలు ఉండే ప్రాంతాల్లో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. గరిష్ట వేతనం రూ.257 లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2007 నుంచి జారీ చేసిన 3.53 లక్షల జాబ్‌కార్డులకు ఆధార్ లింక్ కాలేదని, ఇప్పటి వరకు 2 లక్షల జాబ్ కార్డుల పరిశీలన పూర్తి అయిందని తెలిపారు.

ఎస్టీ కమిషన్ బృందం సర్వే



హొళగుంద మండలంలో సర్వే చేస్తున్న ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు

హొళగుంద/చిప్పగిరి: వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రిటైర్డ్ ఐఏఎస్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్ మ్యాన్ ఎస్టీ కమిషన్ బృందం ఆదివారం హొళగుంద, చిప్పగిరి మండలాల్లో పర్యటించింది. హొళగుంద, కోగిలతోట, పెద్దహ్యాట, నగరడోణ గ్రామాల్లో అనంతపురం జిల్లా సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుమలత ఆధ్వర్యంలో వన్ మెన్ కమిషన్ సభ్యులు పర్యటించారు. ఈ ప్రాంతంలోని వాల్మీకి (బోయ)ల వివరాలు, వారి జీవన విధానం, స్థితిగతులు, పూర్వం నుంచి అనాదిగా వస్తున్న ఆచారాలను ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సర్వే ఫార్మాట్‌లో వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని ప్రొఫెసర్ సుమలత చెప్పారు. వారి వెంట వాల్మీకి సంఘం నాయకులు ఉన్నారు.

రైస్ మిల్లులపై విజి'లెన్స్'



లారీని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

కర్నూలు (టౌన్): రైస్ మిల్లులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు చేశారు. రెండు రోజుల నుంచి ఈ దాడులు కొనసాగుతున్నాయి. రూ.2,10,000 విలువైన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక లారీని సీజ్ చేశారు. ఈనెల 20వ తేదీన బనగానపల్లెలో డాన్ శీనుకు చెందిన శ్రీనివాస రైస్ మిల్లు, లక్ష్మీప్రసన్న రైస్ మిల్లులపై దాడులు చేశారు. పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సెక్షన్ 6ఏ 1955 యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. శ్రీనివాసులు, రవికుమార్, జితేంద్ర, వెంకటసుబ్బయ్య అనే వ్యక్తులపై 420 కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో నాగూరు యాదవ్, కేశవరెడ్డి, హనుమంతు, జయన్న, వెంకటనారయణ, రబ్బానీ పాల్గొన్నారు.

హంద్రీ నదిని దాటుకుంటూ వెళ్తున్న ప్రజలు (ఫైల్)



కేఈల దాటవేత.. దారిచూపిన జననేత

చాలా సంతోషం



ఈ కష్టం ఇప్పటిది కాదు. మా చిన్నప్పటి నుంచి చూస్తున్నాం. భారీ వర్షం వస్తే హంద్రీ నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయి. పంటలు అమ్ముకోవాలంటే మేం నది దాటి వెళ్లాలి. కాజ్‌వే లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నాం. మా ఊరి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడుమూరుకు వెళ్లి అక్కడి నుంచి కర్నూలు మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తీసుకెళ్తున్నాం. లేదంటే కృష్ణగిరికి వెళ్లి వెల్దుర్తి నుంచి కర్నూలుకు వెళ్లాల్సి వస్తోంది. గోరంట్ల వద్ద హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మిస్తే కేవలం 25 కిలోమీటర్ల ప్రయాణంతో కర్నూలుకు చేరుకుంటాం. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. నిర్మాణం పూర్తయితే రైతుల ఇబ్బందులు తొలగిపోతాయి. మా ఊరితోపాటు చాలా గ్రామాలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగు పడతాయి.

– సుంకన్న, ఎస్‌హెచ్ ఎర్రగుడి

కష్టాలు తప్పుతున్నాయి



నాకిప్పుడు 50 సంవత్సరాలు. హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మించాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. పలువురికి వినతిపత్రాలు కూడా ఇచ్చాం. వర్షాకాలంలో ఆసుపత్రికి వెళ్లాలన్నా.. సంతకి వెళ్లాలన్నా.. పంటలు అమ్ముకోవాలన్నా.. బాలింతలు ఆసుపత్రికి వెళ్లాలన్నా మా ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఊరిమీదుగా నడుచుకుంటూ వచ్చారు. నాతో పాటు పదిమంది కలిసి గోరంట్ల వద్ద హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మించాలని కోరాం. అధికారంలోకి వస్తే నిధులు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిసి మా ఊరితోపాటు చుట్టుపక్కల గ్రామాల వాళ్లంతా సంతోషపడుతున్నారు. ఎన్నో ఏళ్లనాటి సమస్య తీరుతోందని సంబరపడుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్ ఎర్రగుడి

కోడుమూరు: దశాబ్దాల కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. కోడుమూరు మండలం గోరంట్ల గ్రామం దగ్గర హంద్రీ నదిపై కాజ్‌వే నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులను ఓఎంఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుంది. ఏడాది లోపు పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. నిర్మాణ పనులను ఈనెల 24న ప్రారంభించనున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా కృష్ణగిరి మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి నుంచి హంద్రీనది మీదుగా కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామానికి 2017 నవంబర్ 27వ తేదీన నడుచుకుంటూ వచ్చారు. ఆ సమయంలో ఆ ప్రాంత ప్రజలు హంద్రీ నదిపై కాజ్‌వే నిర్మించాలని కోరారు. మన ప్రభుత్వం వస్తే కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని అప్పట్లో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు నిధులను మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించింది.

పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్

- హంద్రీ నదిపై రూ.రూ.24 కోట్లతో కాజ్‌వే నిర్మాణం
- 12 గ్రామాలకు తీరనున్న కష్టాలు

ప్రయాణం సులువు

గోరంట్ల నుంచి కొత్తపల్లె, ఎస్‌హెచ్‌ఎర్రగుడి గ్రామాలకు రెండు కిలోమీటర్లు దూరం ఉంది. హంద్రీ నదికి వరద వస్తే 15 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆయా గ్రామాలకు చేరుకోవలసిన దుస్థితి ఉండేది. హంద్రీకి వరద వచ్చే సమయాల్లో విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళలేని పరిస్థితి. కాజ్‌వే నిర్మాణం చేపడితే కష్టాలు తొలగనున్నాయి. అలాగే కృష్ణగిరి, కోడుమూరు మండలంలోని కొత్తపల్లె, రామకృష్ణాపురం, ఎస్‌హెచ్ ఎర్రగుడి, ఎర్రబాడు, చుంచు ఎర్రగుడి, మన్నేగుంట, కృష్ణగిరి, బాపనదొడ్డి, కంబాలపాడు, జి.మల్లాపురం, ఆగవెలి, పి.కోటకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణం సులువు కానుంది.

ఇవీ కష్టాలు..

- గోరంట్ల గ్రామం దగ్గర ఉన్న హంద్రీనది ప్రతి ఏటా వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది.
- ఈ నది దాటి వెళ్లేందుకు కృష్ణగిరి, కోడుమూరు మండలంలోని 12 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.
- కొన్ని సందర్భాల్లో రోజులు తరబడి రాకపోకలు నిలిచిపోయేవి.
- అత్యవసర సమయాల్లో కర్నూలు నగరానికి, కోడుమూరు పట్టణానికి చేరుకోవాలంటే కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది.
- పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రతిరోజూ హంద్రీ నది పరీక్ష పెట్టేది.
- కాన్పుల కోసం గర్భిణులను అసుపత్రికి తీసుకెళ్లాలంటే తలప్రాణం తోకకు వచ్చేది.

పట్టించుకోని టీడీపీ నేతలు

కృష్ణగిరి మండలం కంబాలపాడుకు చెందిన టీడీపీ నేతలు కేఈ కృష్ణమూర్తి, కేఈ ప్రభాకర్ రాజకీయంగా రాష్ట్రస్థాయి వరకు ఎదిగారు. రాకపోకల సౌకర్యం కోసం హంద్రీ నదిపై కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని ప్రజలు విన్నవించుకున్నా కేఈ సోదరులు పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో పదవుల్లో ఉండి కూడా కృష్ణగిరి మండల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



హంద్రీ నదిపై కాజ్‌వే లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. బాల్యంలో మా ఊరు ఎస్‌హెచ్‌ఎర్రగుడి నుంచి నేను లద్దగిరికి చదువుకోవడానికి వెళ్లేవాడిని. హంద్రీపై కాజ్‌వే లేక చాలా అవస్థపడ్డా. హంద్రీ నదికి వరద వచ్చిన రోజుల్లో స్కూల్‌కు వెళ్లలేని పరిస్థితి. దశబ్దాల కాలంగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు కాజ్‌వే నిర్మాణంతో పరిష్కారం దొరికింది. చాలా ఆనందంగా ఉంది.

– సుధాకర్, కోడుమూరు ఎమ్మెల్యే

24న నిర్మాణ పనులకు శంకుస్థాపన



గోరంట్ల సమీపంలోని హంద్రీ నదిపై కాజ్‌వే నిర్మాణానికి ఈ నెల 24వ తేదీన శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం. జిల్లా మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూర్ జయరాం, ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, సుధాకర్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, హాజరుకానున్నారు.

– చాదేశ్వరరావు, డీఈఈ, పీయూఐ

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



పెచ్చెర్వు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవస్థానం అధికారులు

శ్రీశైలంటెంపుల్: నాగలూటి, పెచ్చెర్వు ప్రాంతాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శ్రీశైల దేవస్థానం అధికారులు ఆదివారం పరిశీలించారు. ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. భక్తులు పాదయాత్రతో వెంకటాపురం, నాగలూటి , దామర్లకుంట, పెచ్చెర్వు, మఠం బావి, భీమునికొలను, కైలాసద్వారం మీదుగా శ్రీశైలక్షేత్రాన్ని చేరుకుంటారు. పాదయాత్రభక్తుల సౌకర్యార్థం కాలిబాట మార్గంలో అటవీశాఖ, వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించనున్నారు. నాగలూటి వద్ద జంగిల్ క్లియరెన్స్ చేసి, జనరేటర్లతో విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. అక్కడ ఉన్న పుష్కరిణిని శుభ్రపరిచి భక్తులకు వినియోగంలోకి తీసుకురానున్నారు. పెద్ద చెరువు, దామర్లకుంట వద్ద మంచినీటి వసతి ఏర్పాటు చేయనున్నారు. ఆయా ఏర్పాట్లు దేవస్థాన ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ రామకృష్ణ, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, ఉద్యానవన అధికారి లోకేష్, సహాయ స్థపతి జవహర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు 94.7 శాతం హాజరు

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐజీ, ఎస్పీ



పాణ్యం వద్ద పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు

కర్నూలు(సెంట్రల్): కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన ప్రాథమిక పరీక్ష(ప్రిలిమినరీ) ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలో 48 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 94.7 శాతం మంది హాజరయ్యారు. మొత్తం 22,630 మంది అభ్యర్థులకుగాను 21,421 మంది హాజరవ్వగా, 1,209 మంది గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీసు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. కాగా, పరీక్ష కేంద్రాలకు పది గంటల్లోపు వచ్చినవారికి మాత్రమే లోపలికి అనుమతించారు. పదిగంటలు దాటిన తరువాత వచ్చిన వారిని అనుమతించకపోవడంతో కొన్ని చోట్ల అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగి పోయారు. సిల్వర్ జూబ్లీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఐజీ సెంథిల్‌కుమార్, సెయింట్ జోసఫ్, సిల్వర్ జూబ్లీ, కేవీ సుబ్బారెడ్డి కళాశాలలు, మాంటిస్సోరి స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ తనిఖీ చేశారు.





పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ సిద్ధార్థ కౌశల్

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక 'ఆసరా'

మహిళల పాలిట వరం



వైఎస్ఆర్ ఆసరా పథకం మహిళల పాలిట వరం. రాజేశ్వరి గ్రూపు ద్వారా మేం రూ.4,60,935 రుణం తీసుకొన్నాం. పొదుపు రుణంతో గాజుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాం. మాకు రెండు విడతల్లో ఆసరా సాయం అందింది.

– ఎస్ ఫాతిమాబీ, ఎమ్మిగనూరు

రూ.27,600 జమ



భవాని గ్రూపు ద్వారా పొందిన పొదుపు రుణంతో టైలరింగ్ చేస్తున్నా. వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు అండగా నిలిచింది. మా గ్రూపునకు రూ.27,600 ఆసరా సొమ్ము జమ అయ్యింది.

– ఉప్పర లక్ష్మి, ఎమ్మిగనూరు



సమావేశంలో పాల్గొన్న పొదుపు మహిళలు (ఫైల్)

- మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం అమలుకు కసరత్తు
- రెండు విడతల్లో రూ.276.41 కోట్లు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న పొదుపుగ్రూపు మహిళలు

ఎమ్మిగనూరు: అక్కచెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఆర్థికంగా 'ఆసరా' కల్పిస్తూ కుటుంబాల ఉన్నతికి తోడ్పాటు అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఇప్పటికే రెండువిడతల్లో అక్కచెల్లెమ్మలకు ఆసరా సొమ్మును అందించారు. మూడో విడతకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అర్హుల జాబితాను సచివాలయాల్లో అందుబాటులో ఉంచింది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తోందంటూ మహిళలు సంబరంగా చెప్పుకుంటున్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..

తన పాదయాత్రలో మహిళల కష్టాలు, ఆర్థిక ఇబ్బందులను వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్లారా చూశారు. తాము అధికారంలోకి వస్తే 2019 ఏప్రిల్ 11(సార్వత్రిక ఎన్నికలు జరిగిన) వరకు సక్రమంగా రుణాలు చెల్లించిన పొదుపు మహిళలకు నాలుగు విడతల్లో తిరిగి ఆ మొత్తాన్ని జమ చేస్తామని చెప్పారు. కోవిడ్ కష్టకాలం, ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీ కోసం రెండు విడతలుగా ఆసరా సొమ్ము అందించారు. మూడవ విడతకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

2,43,553 మందికి రూ.543.25 కోట్ల లబ్ధి

వైఎస్ఆర్ ఆసరా పథకం కింద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) పరిధిలో 25 మండలాల్లో 17,353 సంఘాలు అర్హత సాధించాయి. మెప్మా పరిధిలో కర్నూలు కార్పొరేషన్, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీలో మొత్తం 7,422 డ్వాక్రా సంఘాలు ఆసరాకు ఎంపికయ్యాయి. డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలోని 2,43,553 మంది అక్కచెల్లెమ్మలకు రూ.543.25 కోట్లను ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లిస్తోంది. మొదటి విడత కింద రూ.135.55 కోట్లు, రెండో విడతలో 140.86 కోట్లను బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. మొత్తం రూ.543.25 కోట్లకుగాను రెండు విడతల్లో ప్రభుత్వం రూ.276.41 కోట్లు చెల్లించింది. మూడో విడత ఆసరా చెల్లింపుల కోసం జాబితాను సిద్ధం చేసింది. మార్పులు, చేర్పుల నిమిత్తం గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాను ఉంచారు.


మాట నిలబెట్టుకున్నారు



పొదుపు రుణాలు మాఫీ చేస్తామని మహిళలను టీడీపీ అధినేత చంద్ర బాబు మోసం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. మాకు రెండు విడతల్లో వైఎస్సార్ ఆసరా సాయం అందింది. కరోనా కష్టకాలంలోనూ డబ్బులొచ్చాయి.

– తిమ్మక్క, లింగందిన్నె, గోనెగండ్ల మండలం

బయోమెట్రిక్ పూర్తి



వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటికే రెండు విడతల్లో ప్రభుత్వం సాయం అందించింది. మూడో విడతకు ఏర్పాట్లు చేస్తున్నాం. పొదుపు సభ్యుల బయోమెట్రిక్ పూర్తయింది. సోషల్ ఆడిట్ నిమిత్తం లబ్ధిదారుల జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉంచాం. అభ్యంతరాల పరిశీలన అనంతరం అర్హులకు అవకాశం కల్పించి తుది జాబితాను ప్రకటిస్తాం.

– వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ

ముగిసిన పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చేందుకు చేపట్టిన పదోన్నతుల కౌన్సెలింగ్ ముగిసింది. ఆదివారం మారుతిసిటీలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలే నిర్వహించిన పదోన్నతుల్లో నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి స్థానంలో సీనియారిటీ జాబితాల్లో వారి తరువాతి స్థానాల్లో ఉన్న వారికి పదోన్నతులు కల్పించి, పని సర్దుబాటు చేశారు. మొత్తం 1,601మందికిగాను 1,406 మంది పదోన్నతులు తీసుకున్నారు. ఇందులో 188 మంది సర్‌ప్లస్, 77 మంది కన్వర్షన్(ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పని చేస్తూ స్కూల్ అసిస్టెంట్లుగా మార్చుకున్న వారు) తీసుకున్నారు. చివరి రోజు కౌన్సెలింగ్‌లో డీఈఓ రంగారెడ్డి, ఏడీ శ్యామ్యూల్ పాల్, సూపరింటెంట్లు రవికుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సమస్యల పరిష్కారానికి 24న సమావేశం

కర్నూలు(అర్బన్): పెన్షన్ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 24న సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాచయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్రాసు రెజిమెంట్‌కు సంబంధించిన మాజీ సైనికులు, వితంతువులు మాత్రమే సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. పెన్షన్ పేమెంట్ ఆర్డర్, డిశ్చార్జి బుక్, అప్డేట్ బ్యాంకు పెన్షన్‌పాసు పుస్తకంతో పాటు పెన్షన్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను తీసుకుని స్వయంగా రావాలన్నారు.

క్లుప్తంగా

టీడీపీ నాయకుల అరెస్ట్

పగిడ్యాల: పోలీస్ విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడిన మండల టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, పలుచాని జనార్దన్ రెడ్డిని ఆదివారం అరెస్ట్ చేశారు. ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన వీరిద్దరూ పోలీసులను చులకన భావంతో నోటికి వచ్చినట్లు దుర్భాషలాడిన ఆడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన పోలీసులను అడ్డుకుని వారి విధులకు ఆటంకం కలిగించడంతో అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు మాంటిస్సోరి పాఠశాలలో భోజన వసతి, విడిది ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏ.క్యాంపు మాంటిస్సోరి, ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, ఫెన్సింగ్, రగ్బీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ బాలబాలికల పోటీలు సోమవారం నుంచి మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

- ఉపాధ్యాయులను అభ్యర్థించిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉపాధ్యాయులను కోరారు. ఆదివారం ఉపాధ్యాయుల బదిలీల కేంద్రంలో ఆయన పలువురు ఉపాధ్యాయుల ను కలసి ఓటును అభ్యర్థించారు. ఎలాంటి సమ స్యలు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు ప్రతాపుడు, రాజశేఖర్, భాస్కరరెడ్డి, కిరణ్, అనీష్, రుద్రేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

పాణ్యం: స్థానిక పాత ఆసుపత్రి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పాణ్యంలో నివాసముంటున్న మాబున్నీ(60) స్థానిక నర్సరీలో కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తుంది. ఆదివారం సాయంత్రం ఆమె నర్సరీ నుంచి ఇంటికెళ్తుండగా వెనుక నుంచి ఓ యువకుడు బైక్‌పై అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మాబున్నీ తలకు గాయం కావడంతో స్థానికులు శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన యువకుడిది ఆలమూరు గ్రామంగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు.

తడారుతున్న కళ్లు!

- సెల్‌ఫోన్, కంప్యూటర్ వాడకంతో కంటి సమస్యలు
- చిన్న వయస్సులోనే దృష్టి లోపాలు
- కళ్లు పొడిబారడం, ఎర్రబడటం సమస్యలు
- పెరుగుతున్న దూరదృష్టి సమస్య
- కంటి వైద్యుల వద్దకు పెరుగుతున్న విద్యార్థులు

20శాతం పైగా బ్లూలైట్ సమస్యతో వస్తున్నారు



మా వద్దకు కంటి జబ్బులతో వస్తున్న వారిలో 20 నుంచి 30 శాతం మంది ఎక్కువగా కళ్లు పొడిబారడం, ఎర్రగా కావడం, కళ్లలో మంటలు, దురద వంటి సమస్యలను చెబుతున్నారు. ఆన్‌లైన్ క్లాస్‌లు, వర్క్‌ఫ్రమ్ హోమ్ కారణంగా ఈ సమస్య అధికమవుతోంది. ఈ మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని పనిచేయాలి. కంటి ఆరోగ్యం కోసం తినే ఆహారంలో ఆకుకూరలు, పాలు, గుడ్లు, నట్స్, క్యారెట్స్, బీన్స్ వంటివి ఉండే విధంగా చూసుకోవాలి. నారింజ, దానిమ్మ, చీని వంటి సిట్రస్ జాతి పండ్లనూ ఇవ్వాలి. –డాక్టర్ మునీరాబేగం, కంటి వైద్యనిపుణులు, కర్నూలు

పిల్లలను మైదానాల్లో ఆడించాలి



ఇటీవల కాలంలో పిల్లలు స్కూల్‌కు వెళ్లి ఇంటికి రాగానే పుస్తకాలు ఓ మూల పడేసి తల్లిదండ్రుల వద్ద ఉన్న మొబైల్ లాక్కొని చూస్తున్నారు. దీనివల్ల చిన్నవయస్సులోనే వారి కళ్లు పాడవుతున్నాయి. ముందుగా తల్లిదండ్రులు పిల్లల ఎదురుగా మొబైల్‌ను చూడటం ఆపేయాలి. దీనివల్ల పిల్లలకు కూడా మొబైల్‌పై ధ్యాస రాదు. పిల్లలకు మొబైల్‌కు బదులు వారిని మైదానాలకు, పార్కులకు తీసుకెళ్లి ఆడించాలి. దీనివల్ల వారిలో శారీరక, మానసిక వికాసం వస్తుంది.
– ఎం.స్వాములు, చీఫ్ బయోకెమిస్ట్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

యువత ఆలోచనలో మార్పు రావాలి



ఖాళీ సమయం దొరికితే చాలా మంది యువత మొబైల్ ఫోన్‌కు అతుక్కుపోతున్నారు. ఆ సమయాన్ని వారు మంచి పుస్తకాలు చదివేందుకు కేటాయించాలి. దానివల్ల వారికి విజ్ఞానం పెరుగుతుంది. కెరీర్ గైడెన్స్‌కు సంబంధించినవి, ఉన్నత విద్యకు సంబంధించిన పుస్తకాలు, విషయాలపై ఆరా తీయాలి. అలాగాకుండా సమయమంతా మొబైల్‌తోనే గడిపేస్తే భవిష్యత్‌లో వారి జీవితం అంధకారమవుతుంది. ఎందుకూ పనికిరాకుండా పోయి తల్లిదండ్రులకు భారమవుతారు.
–మధుసూదన్, సీనియర్ అసిస్టెంట్, వైద్య ఆరోగ్యశాఖ

కర్నూలు నగరం బుధవారపేటకు చెందిన రామ్‌నారాయణ ఓ ప్రైవేటు కంపెనీలో ఎగ్జిక్యూటివ్ జాబ్ నిర్వహిస్తున్నారు. రోజూ అతను అధికంగా ప్రయాణాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో అతనికి మొబైల్‌తోనే పని ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు ప్రయాణాలు చేసే సమయంలో ఎక్కువ సమయం ఫోన్‌నే చూస్తూ ఉంటాడు. దీంతో అతని కళ్లు ఎర్రబారడం, నీరింకిపోవడం వంటి సమస్యలు రావడంతో కంటి వైద్యుడి వద్దకు వెళ్లాడు. మందులతో పాటు తగిన సూచనలు చేసి అత్యవసరమైతే తప్ప మొబైల్ చూడొద్దని సూచించాడు.

నగరంలోని వెంకటరమణ కాలనీకి చెందిన శ్రీనివాసరావు బెంగళూరులోని ఓసాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కరోనా సమయం నుంచి ఆయన ఎక్కువగా వర్క్‌ఫ్రమ్ హోమ్ ఉద్యోగం చేస్తున్నాడు. దీంతో ఉదయం నుంచి రాత్రి నిద్రించే వరకు ఒళ్లో ల్యాప్‌టాప్ పెట్టుకుని దానినే చూసుకుంటూ పనిచేయాల్సి వచ్చేది. ఈ క్రమంలో అతనికి కంటి సమస్యలు రావడంతో బ్లూరేస్ కారణంగా కళ్లు దెబ్బతిన్నాయని, తగిన జాగ్రత్తలతో స్క్రీన్‌ను చూడాలని కంటి వైద్యుడు చెప్పి మందులు రాసిచ్చి పంపించారు. వీరిద్దరే కాదు...



గంటల తరబడి మొబైల్ వంకే చూడటం, కంప్యూటర్ స్క్రీన్‌కు అతుక్కుపోవడం ద్వారా ఇటీవల కాలంలో చాలా మందికి కంటి సమస్యలొస్తున్నాయి. నీలికాంతి(బ్లూలైట్) కళ్లను విపరీతంగా దెబ్బతీస్తోందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

కర్నూలు (హస్పటల్): సాధారణంగా ఓ సగటు వ్యక్తి మొబైల్ స్క్రీన్‌ను చూసే సమయం ఎంతో తెలుసా...? రోజుకు ఆరు గంటలపైనా ఉంటోంది. మనకు తెలియకుండానే మన చేయి, వేళ్లు మొబైల్‌ను పట్టుకుంటుంటే చూపు తెరపై నుంచి పక్కకు తిరగదు. ఒంటరిగా కూర్చున్నా, పదుగురిలో కూర్చునా, బస్సు, రైలు ప్రయాణాలతో పాటు బైక్‌పై ప్రయాణించినా మొబైల్ తప్ప మరో ధ్యాస ఉండటం లేదు. ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సూర్యాస్తమయం ముందే తినేసి, రాత్రి చీకటి పడగానే పడుకునేవారు. ఇదీ అప్పటి జీవనశైలి. సూర్యుడు ఒక్కడే మనకు కనిపించే కాంతి. ప్రకృతితో మనిషి మమేకమై జీవించేవాడు. ఇప్పుడు పగటి కంటే రాత్రిళ్లే ఎక్కువగా మేల్కొంటున్నారు, పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మొబైల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలోని కృత్రిమకాంతిలో ఉండే బ్లూలైట్ వల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. జనాభాలో 60 శాతానికి ప్రజలు రోజులో 6 గంటలకు పైగా ఈ తెరల్లోనే గడుపుతున్నారని అంచనా. ఇందులో యువతీయువకులు రోజులో 10 గంటలకు పైగా ఈ స్క్రీన్‌నే చూస్తున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో 30 మందికి పైగా కంటి వైద్యులున్నారు. వీరి వద్దకు గత యేడాది నుంచి కోవిడ్ కారణంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్లాసుల వల్ల ఇబ్బంది పడ్డ విద్యార్థులు ప్రతిరోజూ 200 మంది దాకా వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్‌తోఇబ్బందులు

ఒకప్పుడు పిల్లలు కాసేపు స్మార్‌ఫోన్ లేదా టీవీ చూస్తేనే గంటల తరబడి అలా చూస్తే కళ్లుపోతాయని దండించేవారు. ఇప్పుడు తప్పనిసరిగా పిల్లలు ఆన్‌లైన్ క్లాసుల కారణంగా స్మార్‌ఫోన్ తెరకు అంకితం కావాల్సి వచ్చింది. మరోవైపు వర్క్‌ఫ్రమ్ హోమ్ కారణంగా ఇంటి నుంచి నిరంతరం కంప్యూటర్ వర్క్ చేసే వారికి సైతం కంటి జబ్బులు అధికమయ్యాయి. దీనికితోడు కొందరు పనిఉన్నా లేకపోయినా పొద్దస్తమానం మొబైల్ ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారు. ఇలాంటి వారు కళ్లను కాపాడుకోవాలంటే అవసరం ఉంటేనే మొబైల్ చూసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

కళ్లపై బ్లూలైట్ ప్రభావం

మొబైల్ ఫోన్‌లో ఉండే కాంతి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మొబైల్‌లో కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడటం ద్వారా వాటిలోని రేడియేషన్, అల్ట్రావైలెట్ రేస్ వల్ల కళ్లలో నీళ్లింకిపోయి పొడిబారుతున్నాయి. విద్యార్థులు, యువకులు మొబైల్/కంప్యూటర్/ల్యాప్‌టాప్‌ను దగ్గర నుంచి చూడటం వల్ల క్రమంగా వారికి మయోఫియా(దూరంగా ఉన్నవి కనిపించవు) సమస్య వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా దృష్టిలోపం ఉండే వారిలో ఒక సంవత్సరం నుంచి రెండేళ్లకు వారి కంటి అద్దాల నెంబర్ మారుతుంది. కానీ ఎక్కువసేపు ఆన్‌లైన్ క్లాస్‌ల కారణంగా తక్కువ సమయం(ఆరు నెలల్లోనే) కంటి అద్దాల నంబర్ మారుతోంది. దీనికితోడు వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తదేకంగా తెరలను చూడటం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పెరిగి సాయంత్రం వేళ తలనొప్పి వస్తుంది.

జాగ్రత్తలు పాటించాలి

- ప్రతి అరగంటకు ఒకసారి మొబైల్/కంప్యూటర్/ల్యాప్‌టాప్ నుంచి కనీసం రెండు మూడు నిమిషాలైనా దృష్టిని వేరే వైపు మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగుళాల దూరం ఉంచాలి.
- యాంటిగ్లేర్, యాంటి రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్లు మంటలు, నీరుకారడం వంటి సమస్యలుంటే కాసేపు తెరను చూడటం ఆపేయాలి.
- తరచూ చల్లని నీటితో కళ్లు కడుక్కోవాలి. రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి వస్త్రం కప్పి ఉంచాలి.
- కంటికి కసరత్తులు సైతం అవసరం. ఇందు కోసం కళ్లను కుడి, ఎడమలకు అరనిమిషం నుంచి నిమిషం పాటు తిప్పాలి. రెండు అరచేతులు రుద్దుకుని వేడెక్కిన తర్వాత కళ్లపై కాసేపు ఉంచే కసరత్తు చేయాలి.

బ్యాటరీ సైకిల్ రయ్..రయ్!



ఊరూరూ తిరిగే వ్యాపారం.. ప్రతి రోజూ సైకిల్‌పై పదుల కిలోమీటర్ల ప్రయాణం.. నొప్పులతో రాత్రి పూట నిద్రకు దూరం.. మోటారు సైకిల్ కొనుక్కుదామంటే ఆర్థిక భారం.. సమోసాలు అమ్ముకుని జీవించే మద్దికెరకు చెందిన శ్రీరాములు ఎన్నో సార్లు వ్యాపారం వదిలేద్దామనుకున్నారు. జీవనం గడవడం ఇబ్బందిగా మారడంతో సరికొత్త ఆలోచించారు. తన కున్న ఆర్థిక స్థోమతతో సైకిల్‌కు రూ.15 వేలు వెచ్చించి బ్యాటరీ అమర్చుకున్నారు. ఒకసారి చార్జింగ్ చేస్తే ఇది 50 కి.మీ వరకు వస్తుందన్నారు. దీంతో ఎక్కువ సేపు వ్యాపారం చేసుకునేందుకు వీలవుతుందని తెలిపారు. – మద్దికెర

బీజేపీ బలోపేతంపై దృష్టి సారించాలి

- కేంద్ర ఐటీ శాఖ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్



కేంద్ర మంత్రి దేవ్‌సిన్హ్‌తో బీజేపీ జిల్లా నేతలు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని కేంద్ర టెలి కమ్యూనికేషన్స్, ఐటీ శాఖ మంత్రి శ్రీదేవ్ సిన్హ్ చౌహాన్ బీజేపీ నాయకులకు మార్గదర్శనం చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం కర్నూలుకు చేరుకున్న మంత్రికి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ అతిథి గృహంలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. పార్టీ బలోపేతం, పట్ట భద్రుల ఓటర్ల నమోదు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుపై సమాశంలో చర్చించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, పార్టీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ కపిలేశ్వరయ్య, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి వాల్మీకి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కునిగిరి నీలకంఠ, విట్టా రమేష్, వినూషారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అంబాల ప్రభాకరరెడ్డి, అంబలి కాశీ విశ్వనాథ్, కాళింగి నరసింహ వర్మ, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవేంద్ర సమావేశంలో పాల్గొన్నారు. సోమవారం ఆయన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కార్యాలయం ప్రారంభం, బీజేపీ పదాధికారులు సమావేశంలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

అంత్యక్రియలకు వచ్చి అనంత లోకాలకు..



మృతి చెందిన సంజీవరాయుడు

మహానంది: బంధువు అంత్యక్రియలకు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ కేసీ కెనాల్‌లో పడి మృత్యువాత పడ్డాడు. బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామానికి చెందిన సంజీవరాయుడు (48) టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మహానంది మండలం తమ్మడపల్లెలో శనివారం ఓ బంధువు మృతి చెందగా సంజీవరాయుడు అంత్యక్రియలకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళ్తూ బి.కోడూరు వద్ద కేసీ కాల్వలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు దిగాడు. ప్రమాదవశాత్తూ జారిపడిన సంజీవరాయుడు ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతయ్యా డు. తనతో పాటు వెళ్లిన మరొకరి ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు కేసీలో గాలించగా ఆదివారం మహానంది మండలం బొల్లవరం వద్ద మృతదేహం బయటపడింది. మృతుడు భార్య చిన్నహుసేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు మహానంది పోలీసులు తెలిపారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- విద్య కోసం రూ.54 వేల కోట్ల ఖర్చు
- ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయడం తగదు
- ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

కర్నూలు సిటీ: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. విద్య కోసం రూ.54 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. ఎల్లో మీడియా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే దినచర్యగా పెట్టుకుందని విమర్శించారు. ఆదివారం నగరంలోని ఓ పాఠశాలలో ఏపీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంఘం(అపూస్మా)ఆధ్వర్యంలో కర్నూలు పట్టణ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. ఏపీలో విద్యాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. విభజన తరువాత ఆర్థిక ఇబ్బందులకు తోడు కోవిడ్ మహమ్మారి జతకావడంతో ఇబ్బందులు పెరిగాయన్నారు. అయినా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇచ్చారన్నారన్నారు. గతంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు నెలల తరబడి అందేవి కాదని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే రెగ్యులర్‌గా వీరికి వేతనాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ స్కూళ్ల ఉపాధ్యాయులకు 60 రోజులు ఉన్నటువంటి చైల్డ్ కేర్ సెలవులను 180 రోజులకు పెంచారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భాషా పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు ఇచ్చారన్నారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగులు ఇచ్చారని, దశబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి 1998 డీఎస్సీ క్వాలీఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వబోతున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగా ఎల్లో మీడియా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.వి రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, ఏపీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంఘం రాష్ట్ర, జిల్లా గౌరవ సలహాదారులు జి.పుల్లయ్య, ఎస్.శ్రీనివాస రెడ్డి, జిల్లా అధ్యక్షులు వాసుదేవయ్య పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన కుళాయి గుంత



మృతి చెందిన బాలుడు అమాన్

ఆలూరు రూరల్: కుళాయి గుంతలో పడి ఏడాదిన్నర వయసున్న బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన ముద్దనగేరి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాబుసాబ్, ఖైరూన్‌బీ దంపతుల కుమార్తె వలిమాను సి.బెళగల్ మండలం ముడిమాల గ్రామానికి చెందిన షాకీర్‌కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కుటుంబ కలహాలతో ఏడాదిగా వలిమా ముద్దనగేరిలో తల్లి వద్దనే ఉంది. ఆదివారం మధ్యాహ్నం బాలుడు అమాన్ ఆడుకుంటూ ఇంటి ముందు ఉన్న కుళాయి గుంతలో పడి ఊపిరాడక స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆటో బోల్తా.. బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు అంజి

ఆదోని అర్బన్ : ఆటో బోల్తా పడి ఓ బాలుడు మృతిచెందాడు. ఈ దుర్ఘటన బాపులదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి గ్రామానికి చెందిన అంజినమ్మ తన ఐదేళ్ల కుమారుడు అంజిని తీసుకుని ఆదివారం బాపులదొడ్డి గ్రామ సమీపంలో వారి పొలానికి వెళ్తోంది. రోడ్డు దాటుతుండగా ఆటో వేగంగా వచ్చి అదుపుతప్పి బాలుడిపై బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన అంజిని స్థానికులు కోసిగి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు ఉండడంతో ఆస్పత్రిలో తల్లిదండ్రులు, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి వెలుగులు



ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయం



విశాలంగా నిర్మించిన సీసీ రోడ్డు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతోంది. నాలుగేళ్లలో పల్లె వాసులకు ఎన్నో మౌలిక సదుపాయాలు దరి చేరాయి. పల్లెల రూపురేఖలు మారిపోతున్నాయనేందుకు నిదర్శనం పెట్నికోట గ్రామం. రూ.40 లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయం నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17 లక్షలతో బల్క్‌మిల్క్ సెంటర్ నిర్మాణ దశలో ఉన్నాయి. ఉన్నత పాఠశాల నుంచి గుండు మల్లేశ్వరస్వామి ఆలయం సమీపం వరకు విశాలంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి కావచ్చాయి. గ్రామంలో పాలీష్ బండల ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉండటంతో 24 గంటల విద్యుత్ సరఫరాకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కృషి చేశారు. రూ. రూ.60 లక్షలతో కొలిమిగుండ్ల నుంచి పెట్నికోట వరకు ప్రత్యేక విద్యుత్ లైన్ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయి. నాడు-నేడు కింద రెండో విడతలో ఉన్నత పాఠశాలలో రూ.1.60 కోట్లతో పనులు మొదలయ్యాయి. ఎవరూ ఊహించనంతగా నాలుగేళ్లలో అభివృద్ధి జరగడంతో పెట్నికోట సరికొత్త శోభను సంతరించుకుంది.

– కొలిమిగుండ్ల




నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే, బల్క్‌మిల్క్ సెంటర్



సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనారోగ్యంతో బాధపడుతూ..



మృతి చెందిన సాయి సుజాత

అవుకు: అనారోగ్యంతో బాధపడుతూ అవుకు పట్టణంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈబీసీ కాలనీకి చెందిన కంబగిరి, శారద పెద్ద కుమార్తె సాయి సుజాత (20) టీటీసీ వరకు చదువుకొని ఇంటి వద్దనే ఉంటోంది. అయితే కొంత కాలంగా రుతుస్రావ సమస్యతో బాధ పడుతుండటంతో ఆసుపత్రిలో చికిత్స అందించినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి శారద మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్రమణ్యం తెలిపారు.